సాక్షి ఆదిలాబాద్

శనివారం : 10 : ఆగస్టు : 2024



బస్టాండ్‌లో ఫీడింగ్ రూం

ఆదిలాబాద్:ఆర్టీసీ బస్టాండ్‌లో 'స్వాస్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూంను డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య శుక్రవారం ప్రారంభించారు. డిపో మేనేజర్ కల్పన,సంస్థ అధ్యక్షుడు ప్రణయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

12న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్స్

ఆదిలాబాద్‌టౌన్: స్థానిక సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 12న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాంబాబు ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హతగల విద్యార్థులు ఈనెల 11వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన రిమ్స్ డైరెక్టర్



మంత్రికి వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. రిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ యంత్రాన్ని ప్రారంభించేందుకు రావాలని ఆహ్వానించారు. ఆసుపత్రిలో ఓపీ, ఇన్‌పేషంట్ నమోదు తీరు, తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. కాగా ఇటీవల జరిగిన బదిలీల్లో రిమ్స్ నుంచి ఏడుగురు వైద్యులు బదిలీ కాగా ఇద్దరు మాత్రమే వచ్చారని, స్టాఫ్‌నర్సులు 70 మంది ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లగా 10మంది మాత్రమే వచ్చారని డైరెక్టర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బదిలీపై వెళ్లిన వైద్యులను తిరిగి రిమ్స్‌కు డిప్యూటేషన్‌పై పంపించేలా చూడాలని విన్నవించారు. ఆయన వెంట వైద్యులు తిప్పేస్వామి, ఇద్రీస్ అక్బానీ తదితరులున్నారు.

నేడు బాక్సింగ్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు జిల్లా స్థాయి బీడీ మన్మోహన్ బాక్సింగ్ టోర్నీ–2024 ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు విజయేందర్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్–12,14,17 విభాగాల్లో బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు ఆధార్, బర్త్ సర్టిఫికెట్, బోనఫైడ్‌తో పాటు రెండు ఫొటోలతో రావాలని సూచించారు. వివరాలకు ఎంఎం.బేగ్‌ను 9346623810 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న వెంకట్రావ్ నాయక్

ఎదులాపురం: ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్జీటీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.బాపూరావు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గాంధీపార్క్‌లో పుట్టవద్ద పూజలు చేసి పాలు పోస్తున్న మహిళలు

నాగమ్మ.. దీవించమ్మా

ఆదిలాబాద్: నాగుల పంచమి పురస్కరించుకొని భక్తులు నాగదేవతకు ప్రణమిల్లారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వేకువజాము నుంచే అయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబాలను చల్లంగ చూడాలని వేడుకున్నారు.



ఒకరికొకరు బొట్టు పెట్టుకుంటున్న మహిళలు



పుట్టలో పాలు పోస్తున్న యువతులు

హస్తంలో అయోమయం!

- కాంగ్రెస్‌లో తెరపైకి గ్రూపు తగాదాలు
- 'స్థానిక' పోటీకి ఉవ్విల్లూరుతున్న ఆశావహులు
- ఎవరిని ప్రసన్నం చేసుకోవాలనే విషయంలో సందిగ్ధం
- పిప్రి సభ తర్వాత కొత్త సమీకరణాలు
- పాత, కొత్త నాయకుల మధ్య వైరుధ్యాలు

సాక్షి,ఆదిలాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి.. ఇవి ఎప్పుడొచ్చినా తాము పోటీకి సై అన్నట్టుగా అధికార పార్టీ సిద్ధంగా ఉండాలి. అయితే జిల్లా కాంగ్రెస్‌లో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆరాటం ఉన్నా ఎవరిని ప్రసన్నం చేసుకుంటే ఆశీస్సులు లభిస్తాయో అనే విషయంలో ఆశావహుల్లో సందిగ్ధం నెలకొంది. నియోజకవర్గ ఇన్‌చార్జీలు, జిల్లా స్థాయి ముఖ్య నేతలతో అనువుగా ఉండడంద్వారా మెప్పు పొంది ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని ఉత్సాహంగా ఉన్నారు. అయితే తాజాగా బజార్‌హత్నూర్ మండలం పిప్రిలో డిప్యూటీ సీఎం సభ తర్వాత నెలకొన్న పరిణామాలు కొత్త సమీకరణాలకు దారి తీశాయి. దీనికితోడు పార్టీలో కొత్త, పాత నాయకుల మధ్య వైరుధ్యాలు కొనసాగుతున్నాయి. గతంలో అధికారంలో లేకపోయినా పార్టీని పట్టుకొని ఉన్నామని, ఇప్పుడు కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత కల్పిస్తే తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటని పాత నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గాల్లో పలుచోట్ల వారికి పోటీ ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో వారు ఎటు తేల్చుకోలేక పోతున్నారు.

ఈ సమీకరణాలు ఎటువైపో..

జిల్లా పరిధిలో ప్రధానంగా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు పూర్తి స్థాయిలో ఉండగా, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు సంబంధించి రెండేసి చొప్పున మండలాలు జిల్లాలో విస్తరించి ఉన్నాయి. ఇకపోతే ఖానాపూర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఆ నియోజకవర్గంలో వచ్చిన సమస్య ఏమి లేదు. ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండటం, ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జీలే పార్టీకి కీలకంగా ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీ సమావేశంలో కార్యకర్తలు (ఫైల్)

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ సభకు దూరంగా ఉండటం, గైర్హాజరుకు సంబంధించి ఇప్పటి వరకు ప్రత్యేక కారణం వెల్లడికాకపోవడం వంటి పరిణామాలు పార్టీలో చర్చకు కారణమయ్యాయి. ఈ సభ బోథ్ నియోజకవర్గంలో జరగగా, అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఇందులో పాల్గొన్నారు. వేదికపై ఉమ్మడి జిల్లా నుంచి మం

ఆ పరిణామాలపై చర్చ..

చిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరిరావు ఆసీనులయ్యారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా ఆడె గజేందర్ కొనసాగుతున్నారు. ఆయన భట్టికి స్వాగతం పలికేవరకు అక్కడే ఉన్నప్పటికీ సభ జరుగుతున్న సమయంలో ఆ పరిసరాల్లో లేరు. ఇదిలా ఉంటే మధ్యలో బోథ్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని చూసిన కాంగ్రెస్ నేత వన్నెల అశోక్ వేదికపైకి చేరుకోవడం పార్టీలో భిన్నాభిప్రాయాలకు దారి తీసింది. ఈ విషయంలో వివాదం తలెత్తే పరిస్థితి ఉందని గ్రహించి ఓ అధికారి అశోక్‌ను వేదిక పైనుంచి వెళ్లిపోవాలని సూచించినట్లు చెప్పుకుంటున్నారు. దీంతో ఆయన మధ్యలో దిగి వెళ్లిపోయారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ పరంగా బలంగా ఉన్న ఓ నేత తన అనుచరులకు ప్రాధాన్యత కల్పించే విషయంలో ముందుకు కదులుతున్నారని ప్రస్తుతం పార్టీలో చర్చ మొదలైంది. ఈ అంశాలే ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జీలకు, జిల్లాలో కీలకంగా వ్యవహరిస్తున్న ముఖ్య నేతలకు కొంత మింగుడుపడని వ్యవహారంలా ఎదురవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఏదేమైనా ఈ అంశాలు గతంలో కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు మరోసారి తెరపైకి వస్తున్నాయనేది రాజకీయంగా ఆసక్తి కలిగిస్తుంది.

ఎమ్మెల్యేలు లేని దగ్గర నియోజకవర్గ ఇన్‌చార్జీలు చెప్పినదానికే పార్టీ ప్రాధాన్యతనిస్తుందని ఇదివరకు అధిష్టానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీల సమక్షంలోనే పార్టీలో ప్రధానంగా చేరికలు జరిగాయి. కాగా పిప్రి సభ తర్వాత పార్టీలో కొంత అయోమయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనికి కారణం లేకపోలేదు. ఆ సభ జరిగిన రోజే ప్రధానంగా వేదికపై నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలకు ప్రాధాన్యత దక్కలేదనే ప్రచారం పార్టీలో ఉంది. అంతే కాకుండా పార్టీలో ముందు నుంచి ఉన్న నాయకుల ద్వారానే ఈ సభ ఏర్పాట్లు జరిగాయని చెప్పుకుంటున్నారు. కాగా నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్యనేతలు డిప్యూటీ సీఎం విక్రమార్క పిప్రికి చేరుకున్నప్పుడు ఆయనకు ఘనంగా స్వాగతం పలికే వరకు ఉన్నారు. ఆ తర్వాత వేదిక వద్ద అసలు వారి ఆచూకే లేకుండా పోయింది. ఈ విషయంలో వారిలో కూడా అసంతృప్తి కనబడుతుంది. ప్రొటోకాల్ అంశం ఉన్నప్పటికీ తమకు అంతో ఇంతో ప్రాధాన్యత కల్పించి ఉండాల్సిందనే అభిప్రాయంలో వారు ఉన్నారు. దీంతోనే ఇప్పుడు క్యాడర్‌లో ఒక రకమైన తర్జనభర్జన మొదలైంది.

ఆదివాసీల అభివృద్ధికి కృషి

- కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంను జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హీరా సుక జాగృతి సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరా సుక ఆలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్‌తో పాటు ఎస్పీ గౌస్ ఆలం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారికి ఆదివాసీ సంప్రదాయ డోలు, వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. హీరా సుకకు సంప్రదాయ పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. ఆదివాసీల ఆరాధ్య దైవం, చైతన్యస్ఫూర్తి ప్రదాతలు కుమురంభీం, రాంజీగోండ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదివాసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలను ఆదివాసీల దరిచేర్చేందుకు యంత్రాంగం సైతం చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఐటీడీఏ బలోపేతానికి మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సూచనల మేరకు ఆదివాసీలతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారం దిశగా పని చేస్తున్నామన్నారు. ఇందులో హీరా సుక జాగృతి సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్, నాయకులు కుర్సెంగే తానాజీ, రిటైర్డ్ డీసీపీ మడావి బాపూరావ్, యాదవ్ రావ్, మనోహర్, మెస్రం కృష్ణ, పూసం ఆనంద్‌రావ్, గేడం మాధవ్, మెస్రం శంకర్, ప్రకాశ్, గంగాదేవి, కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రమోద్ కుమార్ ఖత్రి, ఏటీడీవో నిహారిక, అనుసూయ, మాజీ ఎంపీటీసీ సంగీత, తదితరులు ఉన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మరో పోరాటానికి సిద్ధం కావాలి



అభివాదం చేస్తున్న ఆదివాసీ నాయకులు

- తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం రూపొందించిన చట్టాల పకడ్బందీ అమలు కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మావల మండలం బట్టిసావర్‌గాం శివారులోని కుమురంభీం గూడ నుంచి ర్యాలీగా టీఎన్జీవో భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా ఇంకా అనేక ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. పోడు భూముల పట్టాలు ఇంకా చాలామందికి అందలేదన్నారు. దీంతో వారంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదన్నారు. 342 జీవో రద్దు చేసి లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీఎస్సీ వేసి నిరుద్యోగ ఆదివాసీ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. వేడుకలకు జిల్లా అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యే హాజరుకాకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అనంతరం ఆదివాసీల సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇందులో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ నాయకులు జంగు, కుమ్ర రాజు, సంజీవ్, దేవన్న, గేడం శివ, గోడం రేణుక, ఉయిక ఇందిర, సోయం లలిత, మర్సుకోల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గురువుల 'అవార్డు' లొల్లి!

- వివాదాస్పదంగా 'ఉత్తము'ల ఎంపిక
- రాష్ట్రస్థాయి అవార్డు ఎంపికకు ఒత్తిళ్లు
- కలెక్టర్ వద్దకు చేరిన పంచాయితీ
- పాత కమిటీ సిఫారసులు రద్దు
- నూతన కమిటీ ఏర్పాటుకు ఆదేశం

ఆదిలాబాద్‌టౌన్: నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు అన్న చందంగా మారింది జిల్లా విద్యాశాఖ పరిస్థితి. అడుగడుగునా విమర్శలు వ్యక్తమవుతున్నా ఆ శాఖలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. ఆ శాఖ ద్వారా చేపట్టే ప్రతీ కార్యక్రమం ఇటీవల వివాదాస్పదమవుతుండటం అధికారుల పని తీరుకు అద్దం పడుతుంది. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికారులు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. ఉన్నతాధికారుల మొట్టి కాయలు వేస్తే తప్ప నిబంధనల ప్రకారం ప్రక్రియ చేపట్టడం లేదు. ఇటీవల స్పోర్ట్స్ స్కూల్ వ్యవహారం సద్దుమణగకముందే తాజాగా రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లా స్థాయి కమిటీ సిఫారసులను కలెక్టర్ పక్కన పెట్టడం విద్యాశాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఈ విషయాన్ని కలెక్టర్ రాజర్షి షా దృష్టికి తీసుకెళ్లడంతో ఆ శాఖ అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. నూతన కమిటీని ఏర్పాటు చేసి అర్హులైన వారిని నిబంధనల మేరకు పారదర్శకంగా ఎంపిక చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి పర్యవేక్షణలో ఉత్తముల ఎంపిక చేపట్టాలని సూచించడం విద్యాశాఖపై ఉన్న నమ్మకమేంటనేది స్పష్టమవుతుంది. మినిస్టీరియల్ ఉద్యోగుల బదిలీలు సైతం కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ నేతృత్వంలోనే నిర్వహించడం ఆ శాఖలో నెలకొన్న పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఈ నిబంధనలు తప్పనిసరి

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక చేయాలంటే తొమ్మిది నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఇందులో పాఠశాలలో విద్యార్థుల చేరికలు, డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించడం, పదో తరగతి ఫలితాలు, విద్యార్థులకు వచ్చిన జీపీఏలు, సదరు టీచర్ బోధించిన అంశాల్లో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడం, అలాగే వినూత్న రీతిలో బోధన చేయడం, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం, ఆధార్ నమోదు, హరితహారం, కిచెన్‌షెడ్‌ల నిర్వహణ వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు. అయితే జిల్లాలో మాత్రం ఇలాంటివేమి పట్టించుకోకుండానే సంఘ నాయకులు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల మేరకు ఉపాధ్యాయుల ఎంపిక జరుగుతుందనే అపవాదు నెలకొంది.



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

అసలేం జరిగిందంటే...

ఏటా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అందించే అవార్డుల కోసం ఉత్తమ గురువుల ఎంపిక చేపడుతారు. అయితే ప్రతీసారి ఈ ప్రక్రియలో రాజకీయం చోటు చేసుకుంటుంది. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు పరిపాటిగా మారాయి. దీంతో అర్హులైన వారికి పురస్కారాలు అందకుండా పోతున్నాయనే విమర్శ వినిపిస్తోంది. అయితే ఈ సారి రాష్ట్రస్థాయి అవార్డు కోసం ఆరుగురు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. పీజీ హెచ్ఎం ఒకరు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ముగ్గురు ఎస్జీటీలు తమ వివరాలతో కూడిన దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేశారు. వాటిని గురువారం పరిశీలించి అధికారుల సూచనల మేరకు కమిటీ సభ్యులు ముగ్గురిని ఎంపిక చేశారు. అయితే ఇందులో ఎస్జీటీ కేటగిరీలో ఎంపికపై లొల్లి జరిగింది. అర్హులైన వారిని పక్కన పెట్టి అనర్హులను ఎలా ఎంపిక చేస్తారంటూ అధికారులను పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు నిలదీశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ ఎంపిక చేసిన జాబితాను రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేసి మరోసారి దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. ఈ బాధ్యతలను అదనపు కలెక్టర్‌కు అప్పగించారు. నూతన కమిటీలో ఎంఈవో, పీజీ హెచ్ఎంతో మరోసారి దరఖాస్తులను పరిశీలించారు. గురువారం ఎంపిక చేసిన జాబితాలోని రెండు పేర్లను తొలగించి కొత్త వారిని ఎంపిక చేసినట్లుగా సమాచారం. నూతనంగా ఎంపిక చేసిన వారి జాబితాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన అనంతరం రాష్ట్రస్థాయి అధికారులకు పంపనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గురువారం ఇద్దరు ఎస్జీటీల మధ్య ఇదే అంశంపై తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడం చర్చకు దారి తీసింది. తాను సీనియర్ ఉపాధ్యాయుడినని ఒకరు వాదించగా, మరో ఉపాధ్యాయుడు కష్టపడిన వారికి అవార్డు దక్కుతుందంటూ పరస్పర వాగ్వాదానికి దిగడం గమనార్హం. రాష్ట్ర స్థాయి అవార్డు కోసం ఉపాధ్యాయుల మధ్య లొల్లి విద్యాశాఖ ప్రతిష్టను దిగజార్చేలా కనిపిస్తోంది. ఈ విషయమై డీఈవో ప్రణీతను వివరణ కోరగా.. ఇంకా ఎంపిక ప్రక్రియ పూర్తి కాలేదని అర్హులైన వారిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు.

జిల్లాకు ఐదుగురు సర్వేయర్లు

కైలాస్‌నగర్: జిల్లా సర్వే ల్యాండ్స్ రికార్డు శాఖలో కొత్తగా ఐదుగురు మండల సర్వేయర్లు చేరారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో పనిచేసిన నలుగురు సర్వేయర్లు నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ జిల్లాలో పనిచేస్తున్న ఎస్. రాజు, శ్రీనివాస్, సుదర్శన్, ప్రసాద్, అఖిల ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఈమేరకు వారు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్‌ను కలిసి రిపోర్టు చేశారు. కలెక్టర్ సోమవారం వారికి జిల్లాలో పోస్టింగ్ కేటాయించే అవకాశముంది.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

- ఆరోగ్యం, పరిశుభ్రతపై దృష్టి సారించాలి
- స్వచ్ఛదనం–పచ్చదనం జిల్లా ప్రత్యేకాధికారి రవి

కైలాస్‌నగర్: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని స్వచ్ఛదనం–పచ్చదనం జిల్లా ప్రత్యేకాధికారి జి.రవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామ స్థాయిలో శానిటేషన్ పక్కాగా నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పరిధిలోని ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య సర్వే నివేదిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తున్నామన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న రవికి కలెక్టర్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వియా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి రవి, పక్కన కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

అంకోలి పీహెచ్‌సీ తనిఖీ

ఆదిలాబాద్‌రూరల్: స్వచ్ఛదనం– పచ్చదనం జిల్లా ప్రత్యేకాధికారి రవి శుక్రవారం మండలంలోని అంకోలి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పరిసరాల శుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆవరణలో మొక్క నాటారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మండలప్రత్యేకాధికారి పద్మభూషణ్‌రాజు, డీఎంవో శ్రీధర్,మండలవైద్యాధికారి సర్వరాజ్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛదనం–పచ్చదనం నిరంతర ప్రక్రియ

ఆదిలాబాద్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని జిల్లా ప్రత్యేకాధికారి రవి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఆవరణలో మొక్క నాటారు.

క్లుప్తంగా

బాసరలో 'శ్రావణ' సందడి

బాసర: బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి శ్రావణ శోభ సంతరించుకున్నది. శ్రావణ మాసం తొలి శుక్రవారం, నాగుల పంచమి కావడంతో భక్తుల సందడి నెలకొన్నది. వేకువజామున శ్రీమహాలక్ష్మీ, సరస్వతీ, మహాకాళీ అమ్మవార్లకు అభిషేకం, అర్చన, విశేష గణపతి పూజ, వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు పూజలు నిర్వహించారు. ముందుగా భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారి సన్నిధిలో చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు జరిపించారు. అమ్మవారి దర్శనానికి భక్తులకు రెండు గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వచ్చి అమ్మవారి చెంత మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

సారంగాపూర్: మండలంలోని దుర్గానగర్ తండాకు చెందిన జాదవ్ సుభాష్ (50) శుక్రవారం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లోంచి పొలం వద్దకని వెళ్లి ఎంతకూ తిరిగిరాలేదు. కాగా, సుభాష్ తన తమ్ముడు పండిట్‌కు ఫోన్ చేసి తాను పొలం వద్ద ఉన్నాను.. తీసుకువెళ్లాలని చెప్పాడు. దీంతో పండిట్ కుటుంబ సభ్యులతో వెతకగా, గ్రామానికి పక్కనే ఉన్న వాటర్ ట్యాంకు వద్ద పురుగుల మందు తాగి కనిపించాడు. వెంటనే అతడిని నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నారు. కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసా రూరల్: మండలంలోని మహగాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నైలు తెలిపారు. వారి నుంచి రూ.26,500 నగదు, 10 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిని భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మూడు ఎద్దుల అపహరణ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ కాలనీలో షేక్ జుబేర్‌కు చెందిన మూడు ఎద్దులు చోరీకి గురయ్యాయి. రోజులాగే గురువారం రాత్రి ఎద్దులను ఇంటి ముందు కట్టి ఉంచగా గుర్తు తెలియని దుండగులు వాటిని అపహరించుకుపోయారు. దీంతో బాధితుడు టూటౌన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

పండుగలా ఆదివాసీ దినోత్సవం



కుమురంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, పీవో, డీఎఫ్వో



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



- హాజరైన కలెక్టర్, ఎస్పీ
- తరలివచ్చిన ఆదివాసీలు
- గ్రామగ్రామాన వేడుకలు
- కుమురంభీంకు నివాళి

ఉట్నూర్‌రూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామగ్రామాన ఆదివాసీలు వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ పాల్గొన్నారు. వారికి గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీలు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు ఉట్నూర్ కేబీ కంప్లెక్స్‌లోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆదివాసీ గిరిజనులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఆదివాసీ యువత ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆదివాసీ సంస్కృతులను గుర్తించి మరింతగా ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఉద్యమ నాయకులు కుమురంభీం, జంగుబాయి జీవనంపై ప్రతీ పిల్లవాడికి అవగాహన కల్పించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. వారి పోరాట ఫలితమే ప్రపంచ ఆదివాసీ దినోత్సవమని వివరించారు. ఆదివాసీల జీవన శైలిలో చాలా మార్పు వచ్చిందని తెలిపారు. మున్ముందు ఆదివాసీలను అభివృద్ధి బాటలో పయనించేలా చూడాల్సిన అవసరముందని చెప్పారు. విద్యార్థుల్లో అవగాహన కోసం ఆశ్రమాలు, పాఠశాలల్లోనూ సంస్కృతిపై ప్రత్యేక శిక్షణ, తరగతుల్లో ఆదివాసీ మహనీయుల గురించి తెలుపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పుర్క బాపురావు, పెందూర్ ప్రభాకర్, హన్మంత్‌రావు, ఆదివాసీ కమిటీ చైర్మన్, సభ్యులు, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు గొప్పవి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి. ఆదివాసీలు వాటిని కాపాడుకోవాలి. ముఖ్యంగా యువత మంచి మార్గంలో పయనించాలి. ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో ఉండాలి. ఇందుకు నావంతు సహకారముంటుంది. – గౌస్ ఆలం, ఎస్పీ

అభివృద్ధి చేస్తున్నాం



ఐటీడీఏ నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. అనేక సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా. కలెక్టర్ స్పందించి సాగు, తాగునీరు, 8వ షెడ్యూల్‌లో గోండు భాష, రహదారుల నిర్మాణం, డైట్ కాలేజీ మంజూరు చేయించాలి – ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

రైతులకు నోటీసులివ్వడం సరికాదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌రూరల్ మండలం రామాయి వద్ద రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు పేరిట భూములు తీసుకుంటామంటూ రైతులకు నోటీసులివ్వడం సరికాదని రైతు సంఘం జిల్లా నాయకుడు బండి దత్తాత్రి పేర్కొన్నారు. రైతులకు నోటీసులివ్వడాన్ని వ్యతిరేకిస్తూ బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామంటూ ఇదివరకే ఎకరాకు రూ.8లక్షల తక్కువ ధరతో 126 ఎకరాల భూమి తీసుకున్న యాజమాన్యం ఏళ్లు గడిచినా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పాటైతే తమ పిల్లలకు ఉపాధి దొరుకుతుందని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్వాకంతో ఇప్పటికే భూములిచ్చిన రైతులు తీవ్రంగా నష్టపోయి కూలీలుగా మారారని వాపోయారు. మరో 620 ఎకరాల భూములను అదే ధరతో సేకరించేందుకు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఒక్కో ఎకరం ధర రూ.50లక్షలు ఉందని పేర్కొన్నారు. ఎకరాకు రూ.8లక్షలు, రూ.10 లక్షలతో భూములు తీసుకుంటే రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశముందని తెలిపారు. ఉన్నతాధికారులు దీనిపై విచారించి రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. బలవంతంగా భూములు లాక్కునే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు.

స్మృతివనం పనులు వేగవంతం చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి: స్మృతివనం పనులు వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలకేంద్రంలోని అమరుల స్తూపం వద్ద చేపట్టిన స్మృతివనం పనులు పరిశీలించారు. అమరుల స్తూపం ప్రాంగణంలో, స్తూపం ముందు ప్రధాన రహదారిపై నాటిన మొక్కలు పరిశీలించారు. ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ వరకు ప్రధాన రహదారిపై నాటిన మొక్కలకు రక్షణ చర్యలు కల్పించలేదని పేర్కొన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఎంపీవో సమీర్‌హైమద్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ తదితరులున్నారు.

జ్వరంతో నిండు గర్భిణి మృతి



పార్వతి (ఫైల్)

కాసిపేట: మండలంలోని రేగులగూడకు చెందిన నిండు గర్భిణి డెంగీ జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగులగూడకు చెందిన గేడం కిరణ్ భార్య పార్వతి (22) నిండు గర్భిణి. ఈనెల 5న తీవ్రమైన తలనొప్పి, వాంతులు కావడంతో కాసిపేట పీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స చేయించి ఇంటికి తీసుకువెళ్లారు. ఇంటికి వెళ్లాక నొప్పి మళ్లీ తీవ్రం కావడంతో వైద్యసిబ్బంది సూచన మేరకు 6వ తేదీ తెల్లవారుజామున మంచిర్యాల మాతాశిశు కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ అడ్మిట్ చేసుకుని చికిత్స చేస్తుండగా 8వ తేదీ సాయంత్రం ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమించింది. డెంగీ జ్వరం ఉందని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకు వెళ్లాల్సిందిగా వైద్యులు సూచించడంతో ఆమె కుటుంబీకులు కరీంనగర్ రెఫర్ చేయాలని కోరారు. దీంతో వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇద్దరిలో ఎవరైనా బతుకుతారు.. అనే ఆశతో కరీంనగర్‌లోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు తిరిగినా ఎవరూ అడ్మిట్ చేసుకోలేదు. తెల్లవారుజామున 4గంటలకు ఎంజీఎంకు చేరుకోగా అక్కడ పరిశీలించి గుండె కొట్టుకోవడం నిలిచి మృతిచెందినట్లు తెలిపారు. బిడ్డ కూడా అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతురాలికి రెండేళ్ల నిండిన కుమారుడు జయదేవ్ ఉన్నాడు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే..

జ్వరంతో ఫిట్స్ వచ్చి పరిస్థితి తీవ్రతరం అయ్యేదాకా వైద్యులు ఏమీ చెప్పలేదని, పార్వతి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాలను బలిగొందని వాపోయారు. వైద్యులు మూడురోజుల్లో సమస్య గుర్తించి చికిత్స చేసినా లేదా రెఫర్ చేసినా బతికే అవకాశం ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.

‘నా భర్తను కువైట్ నుంచి రప్పించాలి’



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాథోడ్ లక్ష్మి

ముధోల్: బతుకు దెరువు కోసం బయటి దేశానికి వెళ్లి అక్కడ బాధలు పడుతూ భారతదేశానికి రాలేని పరిస్థితిలో ఉన్న తన భర్తను ఇక్కడికి రప్పించాలని కోరుతూ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ లక్ష్మి శుక్రవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. తన భర్త రాథోడ్ నామ్‌దేవ్‌ను కువైట్‌కు క్లీనింగ్ పని నిమిత్తం ఏజెంట్ పంపించాడని తెలిపింది. కానీ, అక్కడ క్లీనింగ్ కాకుండా ఎడారిలో ఉంచుతున్నారని వాపోయింది. అక్కడ తన భర్త చాలా ఇబ్బందులు పడుతున్నాడని, తాను బతకలేనంటూ ఫోన్ చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తన భర్తను భారతదేశానికి తీసుకురావాలని వేడుకుంది.

78 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం వాహనాలు, నిందితులతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఇంద్రవెల్లి: కడెం, ఖానాపూర్ నుంచి అక్రమంగా రెండు వాహనాల్లో ఇంద్రవెల్లికి తీసుకువస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, సివిల్ సప్లయ్ మూడవ బృందం అధికారులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు కడెం, ఖానాపూర్ మండలాల నుంచి జీ జలపతికి చెందిన రెండు బొలెరో వాహనాల్లో 78.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించి ఇంద్రవెల్లిలోని ఓ వ్యాపారి వద్ద అమ్మడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో బియ్యం వాహనాలను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని మండలకేంద్రంలోని 3వ చౌకధరల దుకాణంలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ వాహనాలను ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ జీ లక్ష్మయ్య, ఎస్సై శ్రీనివాస్, ఏఎస్వో సుదర్శన్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బాబుసింగ్, మధుసూదన్ తదితరులున్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలోని ద్వారకానగర్, నేతాజీనగర్‌లోని రెండిళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. గత జూన్ 9న పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్ సమీపంలోని ద్వారకానగర్‌కు చెందిన సుంకరి వినయ్‌కుమార్ తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి ముగ్గురు వ్యక్తులు మహారాష్ట్ర నుంచి బైక్‌పై భైంసాకు వచ్చి సుంకరి వినయ్‌కుమార్ ఇంటి తాళం పగులగొట్టి, 17.5 గ్రాముల బంగారం, ఏడు తులాల వెండి, ఫోన్, టీవీ, ఇతర సామగ్రి, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే నేతాజీనగర్‌లో తాళం వేసి ఉన్న బాబోల్ల రమేశ్ ఇంట్లోనూ చోరీకి పాల్పడి ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు, రెండు గల్లపెట్టెలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా, నిందితుడు కౌతెకర్ రాజును సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతడి నుంచి రూ.10 వేల నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు వెల్లడించారు. నిందితుడిపై ఇదివరకే వివిధ పోలీస్‌స్టేషన్లలో 15 కేసులు నమోదయ్యాయని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రాజారెడ్డి, ఎస్సైలు ఎండీ షరీఫ్, ఎండీ గౌస్, ఏఎస్సై లింగురాం, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, కానిస్టేబుల్ ప్రమోద్, గంగాధర్, భూషణ్, ఫిరోస్, ప్రమోద్, గజేందర్, బాలాజీని అభినందించారు.

రైతుల పొలాల్లోకి ‘కడెం’ నీరు



పంట పొలాల్లోకి చేరుతున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి శివారులోని రైతుల పంట పొలాలు కడెం కాలువ నీటి వరదతో నిండిపోయాయి. ఇటీవల కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసి కాలువల్లోకి వదిలారు. ఇలా కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు వస్తున్న నీటితో రాపల్లిలోని చెరువు కుంటను నింపాలని అధికారులు, ప్రజాప్రతినిధులు భావించిచారు. అయితే కడెం ప్రాజెక్ట్ బీ–23 కాలువ ద్వారా నీటి ప్రవాహం పెరిగి సమీపంలోని రైతుల పంట పొలాల్లోకి చేరి పొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఎస్కే షకీల్‌పై గురువారం రాత్రి వీధికుక్కలు దాడి చేశాయి. షకీల్ స్థానిక మసీదువాడలో దారివెంట నడుచుకుంటూ వస్తుండగా ఒక్కసారిగా కుక్క అతడిపై దాడిచేసి కాలిని కొరికింది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే అతడిని దండేపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం ఆస్పత్రి సిబ్బంది మంచిర్యాలకు రెఫర్ చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

తలమడుగు: బీఆర్‌ఎస్‌కు ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చింతలపల్లి దేవారెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న తనకు అధిష్ఠానం తగిన ప్రాధాన్యత లేదని తెలిపారు. పార్టీ బలోపేతానికి సొంత డబ్బులు వెచ్చించినా తనకు గుర్తింపు దక్కలేదని పేర్కొన్నారు. తాను ఏ పార్టీలో చేరకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి




నారాయణ (ఫైల్)

సోన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. వివరాలు.. మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన బోగ నారాయణ (63) తన గ్రామం నుంచి శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో కాలినడకన వెళ్తున్నాడు. జాఫ్రాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై గోపి ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

జన్నారం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామం రూప్‌నాయక్ తండాకు చెందిన భూక్య సక్కులాల్ (60) గురువారం రాత్రి వర్షం కురిసే అవకాశముండటంతో ఇంటి వెనకాల బావికి అమర్చిన మోటర్‌పై కవర్ కప్పేందుకు వెళ్లాడు. ప్లాస్టిక్ ట్యూబ్‌ను మోటర్‌పై కప్పే క్రమంలో ప్రమాదశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీలుగాయిని హతమార్చిన ఘటనలో పదిమందిపై కేసు



ఇద్దరిని జైలుకు తీసుకెళ్తున్న అటవీ సిబ్బంది

దండేపల్లి: మండలంలోని పాతమామిడిపల్లి సమీప అడవుల్లో ఇటీవల నీలుగాయిని హతమార్చిన ఘటనలో పదిమందిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లపేట ఎఫ్‌ఆర్వో సుష్మారావు తెలిపారు. నీలుగాయిని వేటాడి, మాంసం విక్రయించిన ఘటనపై తమ సిబ్బంది తనిఖీ చేయగా, మండలంలోని కర్నపేటకు చెందిన మారినేని సామ్యుల్, రాజన్న ఇళ్లల్లో మాంసం లభించిందని పేర్కొన్నారు. వారిని విచారించగా మరి కొంతమంది పేర్లు చెప్పారని తెలిపారు. ప్రస్తుతం ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగతా వారు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరిని శుక్రవారం లక్సెట్టిపేట సబ్‌జైలుకు తరలించామని వెల్లడించారు.

మాదారంలో ఇల్లు దగ్ధం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, నాయకులు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో రాజీవ్‌నగర్‌లో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. మాదారం ఎస్సై సౌజన్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాదండి లక్ష్మి అనే వృద్ధురాలు తనింట్లో నివాసముంటోంది. శుక్రవారం ఉదయం పనులు ముగించుకుని ఆమె బయటకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా ఇంట్లోంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ సమయంలో ఇంటి సమీపాన ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఇల్లుతోపాటు బీరువాలో దాచుకున్న రూ.లక్ష నగదు, నాలుగు తులాల బంగారం, ఇతర వస్తువులు మంటల్లో పూర్తిగా కాలిపోగా వృద్ధురాలు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. తనను ఆదుకోవాలని వేడుకుంది. ఎస్సై, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సూరం రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, స్థానిక నాయకులు, అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెదిరింపు వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో కొంతమందిని బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్‌కు చెందిన గడ్డం రమేశ్ ఎస్టీపీపీ పవర్ ప్లాంట్‌లో లేబర్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత నెల 24మంచిర్యాలకు చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్యకు ఫోన్ చేసి 'నేను టీవీ రిపోర్టర్‌ను.. నీ రహస్యాలన్నీ నా దగ్గర ఉన్నాయి. టీవీలో ప్రసారం చేయబోతున్నా.. అర్జెంట్‌గా రూ.2వేలు ఫోన్ పే చేయి' అని బెదిరించాడు. పలుసార్లు సమ్మయ్యకు ఫోన్ చేసి బెదిరించగా ఈ నెల 7న మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో రమేశ్‌పై ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు రమేశ్‌ను అరెస్ట్ చేసి విచారించగా నకిలీ విలేకరి అని తేలింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. స్థానిక సీఐ బన్సీలాల్, ఎస్సై సనత్‌కుమార్ ఉన్నారు.

నాలుగు ఇసుక లారీల పట్టివేత



లారీలను మైనింగ్ సిబ్బందికి అప్పగిస్తున్న సీఐ

చెన్నూర్: చెన్నూర్ బతుకమ్మ వాగు సమీపంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నాలుగు ఇసుక లారీలు పట్టుబడినట్లు సీఐ రవీందర్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. రెండు లారీలు కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక క్వారీ నుంచి వస్తుండగా, మరో రెండు లారీలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగుల క్వారీ నుంచి వస్తున్నాయని పేర్కొన్నారు. రెండు లారీల్లో నాలుగు నుంచి ఐదు టన్నులు ఇసుక అధికంగా తరలిస్తుండగా, మరో రెండు లారీల్లో వేబిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. తదుపరి విచారణ కోసం పట్టుకున్న నాలుగు లారీలను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.